నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 31 జనవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




పుష్కర ఘాట్‌ల వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# పుష్కరఘాట్లు ప్రారంభించిన ఎమ్మెల్యే

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 30 : ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బాలేశ్వరాలయ సమీపంలో ఉత్తర వాహిని పెద్దవాగు వద్ద నర్మదా, సరస్వతీ పుష్కర ఘాట్లను స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావుతో కలిసి గురువారం ప్రారంభించారు. అర్చకులు ఇందారం మధుకర్ శర్మ , నరేశ్ శర్మ ఆధ్వర్యంలో గంగమ్మకు మంగళహారతులు ఇచ్చి పూజలు చేశారు. కీ.శే. స్వాతంత్ర సమరయోధులు దండనాయకుల శ్రీనివాసరావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కుంభమేళా సందర్భంగా ఈ పుష్కర ఘాట్‌లను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ పుష్కర ఘాట్లు, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, నాయకులు విశాల్, నవజ్యోతి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకులు దండనాయకుల రామారావు, సురేశ్‌కుమార్, అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు, సంస్థ ప్రముఖులు గుర్రాల వేంకటేశ్వర్లు, రాధాకృష్ణచారి, ప్రముఖులు గుండ వెంకన్న, జీవన్, శ్రీనివాస్, కీ.శే. శ్రీనివాసరావు కుటుంబీకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

# రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్
- వాహన యజమానులు, డ్రైవర్లకు రక్తదాన, నేత్ర పరీక్షల శిబిరాలు

మంచిర్యాల అర్బన్, జనవరి 30 : రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. జాతీయ రోడ్డు మాసోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా గురువారం పాతమంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన, నేత్ర పరీక్షల శిబిరానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణిస్తున్నవారంతా తప్పనిసరిగా సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. ప్రమాదాల బారిన పడిన వారిలో ఎక్కువ శాతం మద్యం సేవించిన వారే ఉంటున్నారన్నారు. గతేడాది 10047 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి ఒకటి నుంచి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేస్తే చర్యలు తీసుకోనున్నట్లు, లైసెన్స్‌ను రద్దు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి తులసీరాం సంతోష్, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డా.హరీశ్ చంద్రారెడ్డి, ఆర్ఎంవోలు డా.భీష్మా, శ్రీధర్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ చందూరి మహేందర్, ఎంవీఐ రంజిత్ రెడ్డి, ఏఎంవీఐలు కాశీం సాహెద్, సూర్యతేజ, పట్టణ సీఐ ప్రమోద్ రావు, ట్రాఫిక్ సీఐ సత్యనారయణ, ఎస్ఐలు, సిబ్బంది, వాహన యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

# సబ్ స్టేషన్ పనులు వేగంగా పూర్తి చేయాలి

- సీఎండీ వరుణ్‌రెడ్డి



సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్ రెడ్డి

చింతలమానేపల్లి, జనవరి 30 : రవీంద్రనగర్-2 గ్రామ సమీపంలోని 132/33 సబ్ స్టేషన్‌ను గురువారం ట్రాన్స్‌కో సీఎండీ వరుణ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. సబ్ స్టేషన్ పనులను వేగంగా పూర్తి చేయాలని, వచ్చే నెలలోగా అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట సీఈ ఆపరేషన్ అశోక్, డీఈ టెక్నికల్ సంపత్ రెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ వీరేశం, డీఈ కాగజ్‌నగర్ నాగరాజు, డీఈ ఆసిఫాబాద్ జీవరత్నం, ఎస్ఈ ట్రాన్స్‌కో వెంకటేశ్వర్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్, ఈఈ సీహెచ్ విజయ్ ప్రతాప్, ఏడీఈ ట్రాన్స్‌కో లక్ష్మీనారాయణ, ఏడీఈ ఎన్‌పీడీసీఎల్ రాజేశ్వర్, శ్రీనివాస్, ఏఈఎస్ ప్రేమ్‌కుమార్, అన్‌జల్‌కుమార్, సంతోష్, శ్రీకాంత్, సాయి కిరణ్ ఉన్నారు.


# కార్పొరేషన్ బోర్డుల ఏర్పాటు



ముల్కల జీపీ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్పొరేషన్ వార్డు అని బోర్డును ఏర్పాటుచేసిన అధికారులు

మంచిర్యాల టౌన్, జనవరి 30 : ఈ నెల 27 నుంచి మంచిర్యాల మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా మారిన నేపథ్యంలో ఇందులో విలీనమైన నస్పూరు, హాజీపూర్ మండలంలోని ఎనిమిది గ్రామపంచాయతీల కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ ఆస్తుల వద్ద మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, మంచిర్యాల నగరపాలక సంస్థ అంటూ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. గురువారం నస్పూరు మున్సిపల్ కార్యాలయానికి నగర కార్పొరేషన్ వార్డు కార్యాలయం అని, ముల్కల, పోచంపాడ్ గ్రామ పంచాయతీలకు కార్పొరేషన్ వార్డులు అని బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో పాటు విలీన గ్రామాలు, మున్సిపాలిటీలకు సంబంధించిన పూర్తి వివరాలు అందజేయాలని సంబంధిత అధికారులకు కమిషనర్ నోటీసులు అందజేశారు.

మంచిర్యాల టౌన్ : మంచిర్యాలలో మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు



# 420 హామీలు కాంగ్రెస్ మోసం బీఆర్ఎస్ నిరసన

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గాంధీజీ విగ్రహాలకు బీఆర్ఎస్ వినతులు
- రేవంత్ సర్కారు వైఫల్యాలపై ఫైర్.. నిరసన

## హస్తం హామీలు అమలు చేసేలా బుద్ధిని ప్రసాదించు మహాత్మా



ఆసిఫాబాద్ టౌన్ : గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



బెల్లంపల్లి : గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్

మంచిర్యాల, జనవరి 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'కాంగ్రెస్.. ఎన్నికలకు ముందు 420 హామీలిచ్చింది. అధికారంలోకి వచ్చి 420 రోజులైనా వాటిని అమలు చేయడం లేదు. ఓ మహాత్మా.. ప్రజలను నమ్మించి మోసం చేసిన ఈ అసమర్థ ప్రభుత్వం కళ్లు తెరిపించు. ఈ దద్దమ్మ పార్టీకి దారి చూపించు.. హామీలు నెరవేర్చేలా బుద్ధిని ప్రసాదించు' అంటూ బీఆర్ఎస్ నాయకులు గురువారం జాతిపిత గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు వినతి పత్రాలు అందించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. అలవికాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలోకి తొక్కిందని విమర్శించారు. కల్యాణ లక్ష్మి.. తులం బంగారం, నాలుగు వేల పింఛన్, రూ.15 వేల రైతు భరోసా ఇలా.. ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదన్నారు. ఏ ఊరికి వెళ్లినా రైతులు రుణమాఫీ కాలేదనే చెబుతున్నారన్నారు. రైతులందరికీ రైతు భరోసా ఇవ్వకుంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎన్నికల షెడ్యూల్ వస్తుందని తెలిసే, కేవలం ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే జనవరి 26న పథకాలు ప్రారంభించారని, ఇప్పుడు ఎన్నికల కోడ్ వచ్చినందుకే పథకాలు ఆగిపోయాయని ప్రచారం చేస్తూ ఓట్లు దండుకోవడానికి, మరోసారి ప్రజలను మోసం చేయడానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. ఏడాది అసమర్థ పాలనను నిరసిస్తూ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేసినా.. ప్రజల పక్షాన పోరాటం చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వినతిపత్రం అందజేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్‌లో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బెల్లంపల్లిలోని పాత జీఎం కార్యాలయ మూలమలుపు వద్ద మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, చెన్నూర్ పట్టణంలోని గాంధీ చౌక్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారమేశ్, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు, నిర్మల్ జిల్లా కేంద్రంలో నియోజకవర్గ సమన్వయకర్త రాంకిషన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము గాంధీజీ విగ్రహాలకు వినతిపత్రాలు ఇచ్చారు.



రెబ్బెనలో గాంధీ చిత్ర పటానికి వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కెరమెరి : గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



చెన్నూర్‌లో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



జన్నారం : గాంధీనగర్‌లోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

# ఉపాధికి రెడీ

- 2025-26లో చేపట్టే పనులకు కార్యాచరణ
- 40 లక్షల పని దినాలు కల్పించేందుకు ప్రణాళికలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల కార్యాచరణను అధికారులు సిద్ధం చేస్తున్నారు. వసతుల కల్పన, వనరుల అభివృద్ధే లక్ష్యంగా గ్రామాల్లో పర్యటించి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గతంలో కంటే భిన్నంగా ప్రజాప్రతినిధులు, ప్రజలను సంప్రదించి ఎలాంటి పనులు కావాలో అడిగి తెలుసుకొని గుర్తిస్తున్నారు.

**జిల్లాలో 40 లక్షల పని దినాలు..**

జిల్లాలో 1.23 లక్షల జాబ్ కార్డులుండగా, దాదాపు 2.52 లక్షల మంది కూలీలు ఉన్నారు. 2025-26 సంవత్సరానికిగాను జిల్లాలోని కూలీలందరికీ పనులు కల్పించడంతో పాటు ప్రతి గ్రామంలో అవసరమైన పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 40 లక్షల పని దినాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పారదర్శకత పాటించేలా పనులకు ఎప్పటికప్పుడు జియో ట్యాకింగ్ విధానం అమలు చేయనున్నారు. ప్రతి రోజూ చేపట్టే పనుల్లో పురోగతితో పాటు కూలీల హాజరు నమోదు చేయనున్నారు. గ్రామాల్లో స్వచ్ఛత, పచ్చదనంతో పాటు భూగర్భ జలాలు అభివృద్ధి చెందేలా పనులు చేపట్టనున్నారు. వ్యవసాయ సంబంధమైన పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఇంకుడు గుంతలు, పొలాలు చదును చేయడం, కంపోస్టు పిట్‌లు, పండ్ల తోటలు, పశువుల పాకలు, గొర్రెలషెడ్‌లు, పాఠశాలల్లో మరుగుదొడ్లు, నర్సరీల అభివృద్ధి, పాఠశాలల్లో వంటగదులు, చేలల్లో వరద కాలువలవంటివి ఏర్పాటు చేయనున్నారు. కాగా, ఉపాధి హామీ పనులు చేసే కూలీలు జాబ్‌కార్డు కలిగి ఉండాలని, జాబ్‌కార్డు లేని వారు దరఖాస్తు చేసుకుంటే వాటిని అందజేస్తామని అధికారులు చెబుతున్నారు.



ఆసిఫాబాద్ టౌన్ : మహాత్మా గాంధీ వర్ధంతి సభలో మౌనం పాటిస్తున్న అదనపు కలెక్టర్, తదితరులు

# మహోన్నత వ్యక్తి గాంధీజీ

నస్పూర్/ఆసిఫాబాద్ టౌన్, జనవరి 30 : అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహోన్నత వ్యక్తి మహాత్మా గాంధీ అని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పేర్కొన్నారు. గురువారం మంచిర్యాల, ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లలో గాంధీజీ వర్ధంతి నిర్వహించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మౌనం పాటిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



# బుగ్గగూడ శివారులో పెద్దపులి

కాసిపేట, జనవరి 30 : కాసిపేట మండలం బుగ్గగూడెం శివారులోని అటవీ సమీపంలో పెద్దపులి సంచరిస్తుండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. బుగ్గగూడెం శివారులో పర్యటిస్తున్న క్రమంలో పెద్ద పులి పాదముద్రలను గుర్తించినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. శివారు గ్రామస్తులు అటవీలోకి వెళ్లరాదని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు.